# వెన్నెల వాన

మూడు రాత్రులూ ముగిసి పోయినా ముద్దు తీరనే లేదు. ముద్దరాలి ముద్దు మోమున మునిగోరంత నొక్కుడూ లేదు. మునిపంటి గాటూ లేదు.

మూడు రాత్రుల ముచ్చట్ల గురించి గుచ్చి గుచ్చి అడిగిన నెచ్చెలులను ఇచ్చకాలతో మరిపించ దానికి చచ్చి చెడ్డ పనయింది. భర్తతో కాపురానికి బయలు దేరిన భాగ్యలక్ష్మికి మనసు ఒడ్డున పడ్డ చేపలా విలవిల లాడిందంటే.... ఆడదూ?

మనసైన సంబంధం... మంచి మగవాడు... అందగా డంటే ఇలా ఉండా లని అనిపిం చేలా దర్జాగా రారాజులా ఉన్నాడు. అత్త మామల పోరు లేకుండా కొత్త కాపురం మత్తుగా సాగడానికి వీలుగా... దూరంగా బెంగుళూరులో అతని ఉద్యోగం....

అదృష్టం ఇలాగే కనికరిస్తుం దనుకుంది భాగ్యలక్ష్మి.

అదృష్టం అనిపించిందే అది...

మారు వేషంలో వచ్చిన దురదృష్టమా?

సూపర్ డీలక్స్ బస్‌లో....చల్లటి రాత్రి ప్రయాణం.... వెనుక సీట్లలో.... కుదుపుల్లో ఉయ్యాల లూగు తుంటే......పడుచుదనం పరవళ్ళు తొక్కుతోంది....

మగత నిద్రలో....పొదువుకుని పట్టుకున్నాడు ప్రకాశం. అతని జుత్తు అల్లరిగా దూకుతూ బుగ్గల్ని తాకుతుంటే... పొగరుగా వగరుగా అనిపిస్తోంది. ముఖంలో నిజాయితీ.... నిర్మలత్వం....కరుకు దనం ఉన్నాయి. సగం నిద్రలో క ళ్ళరమోడ్పుగా....మధ్య మధ్యన ...రెప్పల్ని బలవంతంగా కదిలిస్తూ.... చూస్తూ.... మెల్లగా చల్లగా నవ్వుతున్నాడు.

పడి చచ్చేంత ఇష్ట మనిపిస్తుంది. అమ్మో...చంపేస్తా డేమో అన్నంత భయ మేస్తుంది. పురుషత్వం అంటే... ఇలాగే ఉంటుంది అని ఖచ్చితంగా అనిపిస్తుందే...ఈ మనిషిలో... ఈ మూర్తిలో...లోపమా?

లోపమే లే దనుకుంటే.... తన మీదైనా, తన వారి మీదైనా, ఏదైనా

కోపమా? ఎందు కైనా....తాపమా?

అయినా అలా అనుకోవడానికి లేదే!

మూడు ముళ్ళు పడ్డప్పటి నుంచి ఇప్పటి దాకా కూడా ఈ ముద్దుల పెళ్ళికొడుకు ముఖంలో మురిపాల నవ్వు చాయ మాయనే లేదు. అలకా లేదు, అన్య మనస్కమూ లేదు. అందరిలో ఇంకా అందంగానే వెలిగాడు. బంధువులతో బంధాలు పెనవేసు కుంటూ మెదిలాడు. అత్త మామల నెప్పుడూ ఆదరంగా పరామర్శిస్తూ వచ్చాడు.

ఇక తనతో ఏకాంతమా? గుండె జల్లు మంటోంది. కలల వీణ ఘలంఘులల ఝణం ఝణ నిక్వణాలలో ఏదో అపశృతి.... మూగ రోదన....

తొలి రేయి హాయి కోసం మల్లెపూల మంచపు గది లోకి అడుగు పెడితే... క్షీరసాగరాన ఆనంద శాయిలా ఉన్న ప్రకాశం....నిండు కళ్ళతో చూడ లేదూ తన కేసి? అభిమానం, ఆత్మీయత, ప్రేమ, కోరిక, లేదూ? లేదూ? అన్నీ ఉన్నాయి...ఏ కొరతా లేదు.

పొడి పొడి మాటల వెనుక ఎంత తొందర...ఎంత ఆశ.... ఆరాటం.... పోరాటం....

ఊ...ఆ...అంటూ తను గొణుగు తుండగా...గుండె నిండా మెత్తటి పరిమళాల మంట...

స్వప్నాన్ని తాకుతున్నట్టు అతను తాకి, దూరాన్ని చెరిపేస్తూ చేతులకీ పెదవులకీ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఇచ్చెయ్య లేదూ?...నుదుటి మీద ముద్ర. కనుబొమ్మల మీద ఇంద్ర ధనస్సు... కళ్ళలో రెండు జాబిలి బింబాలు. నాసికపై మెత్తటి పూల రెమ్మ తాకిడి.

పెదవులపై కొంటె తుమ్మెద.....

ఎంత ఆర్తి ఎంత ఆశ ఎంత కోరిక ఎంతగా స్వంతం కావాలని ఉద్వేగ ఉద్రేక క్షణాలలో.... తడుముతున్న చేతి వేళ్ళు ప్రభు శాసనాల్లా అదుపు చేస్తూ నడుము వంపు నునుపు మీటి వెన్ను తాకి అల్లిబిల్లిగా పాకి.... కన్నె గోపురాల మీదికి పక్షుల్లా ఎగిరి వాల లేదూ?

ఆ వేళ్ళకి ఎన్ని కువకువలు వచ్చునని!

పూర్వ పాండిత్యం బోలెడు ఉందేమో!

ఉన్నా.... మగాడు...సర్వ స్వతంత్రుడు.... ఇకపై తన సొగసుల బరికి కట్టు బడతా డని అతిశయం. నిమురుతున్న సొగసుల్ని మల్లె పానుపు నిండా

పరిచి చూసుకో లేదూ? చూసే అతణ్ణి చూడలేక కనుమూసే లోగా...కొంటెగా అల్లరిగా...తననూ చూడ మన లేదూ?

సాయంత్రం నుంచి చేసుకున్న అలంకరణ.... చెమట బిందువుల స్వైర విహారానికి లజ్జగా కరుగు తుండగా అరమోడ్పు కళ్ళు అద్భుత స్వర్గానికి ఆశ పడే క్షణంలో...ముద్దు ముద్రలు వేస్తున్న ముద్దుల మగడు ... హఠాత్తుగా...ఎందుకు దూర మయ్యాడు?

దారుణమైన అపశృతి.

శిఖరం నుండి జారి పడి పోయింది మనసు. అలసట బరువుతో అతను ఎడంగా పడుకున్నప్పుడు....తాకా లన్నా పలకరించా లన్నా భయ మనిపిం చింది.

సెక్స్ విజ్ఞానం గురించి బోలెడు చదివింది. కొత్త వల్ల తొందర వల్ల అతని ఆవేశం అసందర్భంగా కరిగి పోయిం దేమో ననిపించినా.... అతని ధోరణిలో.... ఆ తొట్రు పాటు కూడా లేదు. ముఖం ముడుచుకుని పడుకున్నాడు.

లోపం...అతని లోనా? తనలోనా?

మళ్ళీ మిగతా అన్ని మాటలూ మాట్లాడుతూ అలాగే నిద్ర పోయిన అతణ్ణి కవ్వించి ఇబ్బంది పెట్టా లనిపించ లేదు.

అయినా తను ముగ్ధ కన్య. అతనే అపర మన్మథుడు. తనేం కవ్వించ గల దతణ్ణి? బ్రతుకే విలవిల లాడినంత బాధ. అప్పుడే అనుకుంది. ఎవ్వరికీ చెప్పకూడదు. చెబితే సిగ్గుచేటు. తనకూ అతనికీ పరువు చేటు. అతనికి ఏ లోపం ఉన్నా జన్మలో బైట పెట్ట కూడదు. చచ్చేన్ని లోపాలే ఉన్నా.... అతను తన మగడు, ప్రియుడు...

అతని కడగంటి చూపులో కమ్మటి ఆత్మీయత చాలు...బ్రతుకంతా నిర్భయంగా గడిపెయ్య డానికి.

కానీ...నిజంగా లోపమా? ఎందుకైనా...నటనా? తన కేదైనా ...పరీక్షా?

మరుసటి రోజు ఉదయం...అందరి పరామర్శల్నీ చాలా అందంగా తప్పించుకుంది.

వాళ్ళు నమ్మరేమో అనే భయం ఉన్నా...తల నొప్పి అనీ...నిద్రగా ఉందనీ...ఎవరి తోనూ మాటలు పెంచకుండా తప్పుకుంది. ఆ మాటలకి వాళ్ళు సహజం గానే.... రసవంతమైన అర్థాలు తీసుకుని సరసోక్తులతో సరదా

తీర్చు కున్నారు.

వాళ్ళ సరదా నవ్వులు మోగిన కొద్దీ తన మనసులో అనుమాన అవమానాల పరదాలు రెపరెప లాడాయి. రస భంగమైన తొలి రాత్రి చీకటి చాయల అపశృతుల నిట్టూర్పుల సెగలు...ఇలా అయిన ఆడ పిల్లలు ఆ తర్వాత ఏం చేస్తారు? ఎవరితో ఏమని చెప్పుకుంటారు? ఏమవుతారు?

రెండో రోజు...సాయంత్రం...చీకటి ముసురు తుండగా మనసులో తెరలు తెరలు తెరలుగా భావ ప్రకంపనాలు. అలంకరణకి సాయం చెయ్యడానికి వచ్చిన నెచ్చెలులు పరిపరి పరిహాసాలతో కవ్విస్తున్నారు.

అప్పుడే మెల్ల మెల్లగా ఒక విషయం...అలవోకగా మెదిలింది. తన మేని చాయ... ఒక పిసరు వన్నె తక్కువ. చామన చాయ కన్న మెరుగే కాని దబ్బ పండు చాయ కాదు. చాలామంది మగవాళ్ళు ఎర్రగా పండులా ఉండే అమ్మాయిల్ని ఇష్ట పడతారు.

తన కెప్పుడూ చాయ తక్కువ కాంప్లెక్స్ అలాగే ఉండి పోయింది. అయితే కాస్తంత క్రీమ్, స్నో, గులాబీ రంగు పౌడర్ అద్దడం మొదలెట్టిన తర్వాత ఆ లోపం పెద్దగా తెలియ లేదు. తనకు తెలియ లేదు.

పై వాళ్ళకు తెలియదూ? ప్రకాశానికి తెలియదూ?

అద్దంలోకి చూస్తుంటే...ప్రతిబింబం ప్రశ్నార్థకంలా కనిపించింది. ముఖం చంద్ర బింబమే...కాస్త వెన్నెల తక్కువ...అంతే!

నెచ్చెలులు అలంకరణ పూర్తి చేసి తృప్తిగా చూసుకుంటూ ఉండగా, ఫినిషింగ్ టచ్ అన్నట్టు పౌడర్ పఫ్ అందుకుని చెంపలకి రాసుకుంది. చెలికత్తెలు సన్నగా నవ్వుకున్నా రంటే...నవ్వుకోరా?

మరి కాస్సేపటికి...శోభనం గదిలోకి కాలు మోపు తుండగా...గుండె లయ తప్పి కొట్టుకుంది.

ముందు రోజు లాగే ఘుమఘుమ లాడుతున్న గది నవనవ లాడుతున్న నవ మన్మథుడు...ఆవేశంలో కొట్టుకు పోకుండా మనసుని అదుపు చేసుకుంటూ...అతని అనునయాలకు బదులు పలికింది.

అతని కళ్ళలో, మాటల్లో, స్పర్శలో...ఆత్రుత ఆగడం లేదు, దాగడం లేదు. అయినా అద్భుతంగా కంట్రోల్ చేసుకుంటూనే ఉన్నాడు. ఆ సంగతి తెలుస్తూనే ఉంది. లోపమా? అసంభవం!

ఎంత గట్టిగా ఒడిసి పట్టుకున్నాడు!

నడుమును క్షణాలలో మెలిపెట్టి నలిపేశాడు. పెదవుల్ని నిమిషాలలో నొక్కి అద్ది పీల్చాడు.

కళ్ళు తిరిగి పోతుంటే...కాలమే ఆగి పోయింది. లొంగి పోతున్న కన్నెతనం వెన్నలా కరిగి పోతోంది. ప్రభువుకు సమర్పించు కొంటున్న నైవేద్యపు సొగసులు జన్మ తరించినట్టు మురిసి పోతున్నాయి.

స్వామిలా స్వాధీనం చేసుకుని...మొహమంతా మోహాలతో ముద్దు ముద్రలతో ముంచెత్తే వేళ...కన్నె కల పండే వేళ...హఠాత్తుగా తొలగి పోయాడు. పక్కకు తిరిగి పడుకున్నాడు. అలిశాడో, అలిగాడో, భంగపడ్డాడో...మాటా పలుకూ లేకుండా అయి...కాస్సేపటికి గాఢంగా నిద్ర పోయాడు.

తెల్లవారే దాకా...తనకు...నిశ్శబ్ద నరకం...

మరుసటి రోజూ....ఇదే తంతు! మూడో రాత్రి...ముచ్చటగా తనే చొరవ తీసుకుంది.

అనునయంగా అడిగింది. బుజ్జగించింది. అయినా నిలదియ్య డానికి భయం. లోపమున్న మనిషయితే...అంత కోరికగా చూస్తాడా? అంత నిర్భయంగా...చూపులతోనే చురుక్కున కాల్చేస్తాడా?

కాకపోతే అతను చాలా సెన్సిటివ్.

నాజూకు మనిషి. అద్దానికి మనిషి రూపం ఇచ్చి బట్టలు తొడిగి నంత పెళుసు. తళుకు.

ఏం చెప్పాడు? ఏమీ చెప్పలేదు.

ఏం చేశాడు? గుచ్చి గుచ్చి చూశాడు. తనే మైనా తప్పు చేసిందా? తన గురించి ఏమైనా విన్నాడా? అది కాస్తా ఆ క్షణం లోనే గుర్తొచ్చి బాధిస్తోందా?

అటువంటి అనుమానా లున్నా నిలదీసి అడిగేంత నిజాయితీ ఉందతనికి.

కాని ఆ ధోరణే లేదు. ఏమీ జరగనట్టే ఊరుకున్నాడు. అడగడానికి, చెప్పడానికి, వినడానికి...ఏమీ లేదన్నట్టే ఉందతని ధోరణి...

పరిష్కారం తెలియని సమస్య బిగిసి ముడి పడుతుండగా ముచ్చటైన మూడో రాత్రి కూడా అసందర్భంగా తెల్లారింది. ఆ తర్వాత హడావుడిగా కొత్త కాపురానికి ప్రయాణం... అంతే...

తెలతెలవారే వేళ...బస్సు బెంగుళూరు బస్టాండులో ఆగే సమయంలో నడుము చుట్టూ చెయ్యి వేసి గట్టిగా నొక్కి వదిలాడు ప్రకాశం.

"రాత్రంతా కలవరిస్తూ ఉండి పోయావు...నేనే పలకరించినా పలకలేదు

నువ్వు! అంత మైమరు పేమిటో?..." అన్నాడు.

మూర్ఖుడా? రసికుడా? ఎవరు కలల్లో ఉండి పోయారు? ఎవరి కలల్లో ఉండి పోయారు??

ఇల్లంతా చూసి చూసి తెగ ముచ్చట పడిపోయింది భాగ్యలక్ష్మి.

ఇల్లాలికి స్వాగతం చెప్పడానికా అన్నట్టు ఇల్లంతా చక్కగా అమర్చి పెట్టాడు ప్రకాశం.

కొత్త సోఫా సెట్టు, కొత్త డబుల్ కాట్, సరికొత్త ఫ్రిజ్ (బెంగుళూరులో శుద్ధ అనవసరం), కర్టన్స్, డైనింగ్ టేబుల్ దగ్గర కళ్ళు చెదిరేన్ని పింగాణీ గిన్నెలు...కొత్త కాపురం మీద ప్రకాశానికి ఎన్నెన్ని కలలు ఉన్నాయో ప్రతి వస్తువూ చెప్పక చెబుతోంది.

పెళ్ళంటే, తనంటే, కాపురం అంటే...ఇష్టంలేని మనిషయితే...ఇవన్నీ ఇంత శ్రద్ధగా సమకూర్చు కుంటాడా? శారీరకంగా ఏ లోపమో ఉంటే...వీటి మీద మన సుంటుందా? కొత్త పెళ్ళాం వచ్చే సరికి ఇవన్నీ అమర్చా లనిపిస్తుందా?

లేక కొంపదీసి వీటితోనే సరిపెట్టుకోవాలా?

ఇంటికి వచ్చినప్పటి నుండి కబుర్లతో తెగ ఊదర గొట్టేశాడు ప్రకాశం. సంబరంగా ఇరుగు పొరుగు వాళ్ళని పిలిచి భార్యని పరిచయం చేశాడు.

ఆఫీసుకి ఫోన్‌చేసి కొలీగ్స్ అందర్నీ సాయంత్రం టీ కి పిలిచాడు. వాళ్ళందరికీ తనను గొప్పగా పరిచయం చేశాడు. తన అందాన్ని వాళ్ళు మెచ్చుకుంటూ ఉంటే ప్రకాశం కళ్ళలో మెదిలిన గర్వం...అబద్ధ మనుకోవ డానికే లేదు. చలి వణికించే బెంగుళూరులో...చీకట్లు ముసురుకునే వేళకే కోరికలు రెప్ప విప్పుతాయి.

పెళ్ళయిన వెంటనే ఆ హడావుడి, బంధువుల మధ్య మొహమాటాలు, శోభనం అనే తంతు సహజంగా కలిగించే బెరుకు...వీటన్నిటి వల్లా వ్యవహారం చెడిందిగాని.... ఇక్కడ ఇప్పుడు...పూర్తి స్వేచ్ఛ...అక్షరాలా అడ్డే లేని ఏకాంతం...

ఇప్పటి నుండి ఇక ప్రతి రాత్రీ వసంతరాత్రీ...ప్రతిక్షణం ప్రత్యక్ష స్వర్గమౌతుం దనుకుంది భాగ్యలక్ష్మి.

ఇనుమడించిన ఉత్సాహంతో అప్సరసలా ముస్తాబు చేసుకుంది. గుప్పు మనే కోరిక లాంటి పడగ్గది లోకి అడుగు పెట్టగానే...అంతకు రెండింతల ఉద్వేగంతో ఉన్నాడు ప్రకాశం. ఆర్తిగా వాటేసు కున్నాడు. తమకంగా అల్లుకున్నాడు.

చుబుకం నుంచి అరికాలు దాకా ముద్దుల ముద్రలతో నింపేశాక...

ఏదో వ్రతం చేస్తున్నంత పవిత్రంగా పెదవులు అందుకుంటూ... అదే సమయంలో చేతుల నిండా అంద వలసినవి అందుకుంటూ...అదే సమయంలో...నడుమెందుకు ఉందో నడుమే అడుగుతుం దన్నట్లుగా, విచిత్ర మధురమైన కదలికతో అదిమి ముద్దుగా, లాలనగా ఏవేవో గొణిగాడు.... "నువ్వు నా లక్ష్మివి...దేవతవు...చాలా కష్ట పెట్టాను కదూ? సారీ..." అంటూ మెలికలో ముడి పడ్డ శరీరాలకు ప్రేమ సంకెల వేసే తరుణంలో...కన్నె గుండె...వన్నెల వెన్నెల తుపానులో ఊగి పోతుండగా...

హఠాత్తుగా మొహం తిప్పుకున్నాడు..."ష్..." అంటూ అటు తిరిగి పడుకుండి పోయాడు.

వెన్నెల చీకటైంది. అందే స్వర్గం అంతు లేని నరక మైంది. ఆ రాత్రి అంతం లేని కాళరాత్రి...

తెల్లవారే దాకా ఆలోచనల్లో గడిపిన భాగ్యలక్ష్మి మెల్లగా ప్రకాశాన్ని మేలు కొలిపింది.

తొలి సిగ్గు మొగ్గల్ని కొంచెం దూరంగా నెట్టేసి అనునయంగానే అడిగింది అతణ్ణి. అతనేమీ అనుకోలేదు. ఇద్దరి మధ్యా భయా లేమీ లేవు. అతను బోలెడు అవమానంగా ఫీలవు తున్నాడు. లోప మేమీ లేదు. కోరికకు కొరతలేదు. మరి? అదే తనకూ తెలియడం లేదు. ఎందుకలా అయిపోతుందో గాని...సారీ...అంటూ లేచి వెళ్ళాడు ప్రకాశం.

ఆ తర్వాత అతను మామూలు గానే ఆఫీసుకి తయారవుతూ ఆఫీసు పరిస్థితులు, ఇంటి అవసరాలు, చిన్న చిన్న సమస్యలు...వీటి గురించి చెప్తున్నాడే గాని...భాగ్యలక్ష్మికి వాటి ధ్యాసే పట్టలేదు.

అతను వెళ్ళి పోయాక తలు పేసుకుని చాలా సేపు ఏడుస్తూనే ఉండి పోయింది. ఒక్క సారిగా పుట్టింటికి వెళ్ళిపోదా మనిపించింది. వెళ్ళి ఎవరికేం చెప్పాలి? ఎంత రభస? ఎంత అలుసు! మనసు విలవిల. కలలు విరిగిన శబ్దం. కోరికలు తెగుతున్న నరకం. నిట్టూర్పు నిప్పు. ఒంటరితనం ఎడారి.

సాయంత్రం ప్రకాశం వచ్చే వరకు బద్ధకంగా పడుకునే ఉంది. కాఫీ పుచ్చుకున్నాడు. ఆఫీసు కబుర్లు. కాస్సేపు రిలాక్స్ అయ్యాక హుషారుగా స్నానానికి కదిలాడు ప్రకాశం. "నువ్వూ రెడీ కాకూడదూ? అలా సర్దాగా షాపింగ్

చేసొద్దాం..."అన్నాడు.

అప్పుడు గుర్తొచ్చింది. ప్రొద్దు న్నుంచి స్నానమే చెయ్య లేదు తను. దారుణం. ఎప్పుడూ ఇలా జరగ లేదు. జ్వరంలో తప్ప. ఇప్పుడు మనసుకి జ్వరం.

తల కూడా దువ్వుకో లేదు. ప్రకాశం గమనించ లేదా? తనెలా ఉన్నా ఒకటేనా అతనికి? అంద చందాలే తెలీని మూర్ఖుడా? జడుడా? అరసికుడా?

ఆఫీసుకి వెళ్లాడు, వచ్చాడు. షాపింగ్ అంటున్నాడు. ఇంట్లో భార్య పగలంతా ఏం చేస్తోంది? పట్టించు కోడా? మనిషా? మెషినా?

అతని మీద కోపం...చిరుకోపం. ఇదే మొద లేమో. అసహ్యం పెరుగుతుం దేమో! మనసు బెడిసి కొడితే? ఎంత కాలం కంట్రోల్ ఉంటుంది?

బాత్‌రూమ్‌లో ఈల. జాలీగా పాట. చిటికె లేస్తూ వచ్చాడు. "కమాన్...నువ్వూ రెడీ అవ్..." అంటూ బట్టలు అందుకున్నాడు.

వేణ్ణీళ్ళ స్నానం చేస్తున్నా శరీర మంతా కొరడు గట్టి నట్లే అనిపించింది. ఎందుకీ శరీరం? అనిపించింది. చీకటి ముద్ద...రాయి. జడ పదార్థం. అంతేనా?

ప్రకాశం ముందు గదిలో తచ్చాడు తున్నాడు.

స్నానం ముగించిన భాగ్యలక్ష్మికి...షాపింగ్ మీద ఏ మాత్రం ఇంట్రెస్ట్ లేదు. అతనితో ఎక్కడికీ వెళ్ళాలని లేదు. మాట్లాడాలనే లేదు. ఎవ్వర్తోటీ.

బట్టలు...మంచి చీర ఏది? ఎందుకు? ఏదైనా ఒకటే. సెలెక్షన్ లేదు. మర బొమ్మలా తయా రవుతోంది.

సుతి మెత్తటి అడుగుల సవ్వడి...గుర్తు పట్టేంతలో..."వావ్..." అన్న కొంటె శబ్దం. నడుము పై చేతులు.

ఆ తర్వాత గుక్క తిరగలేదు.

"లక్ష్మీ..." అనకపోతే...ప్రకాశమని కూడా తెలిసేది కాదు. చుట్టేశాడు. ఎంత మెత్తగా వచ్చాడు! ఊపిరాడని ముద్దు. గాలిని నలిపే కౌగిలింత. మెత్తటి మంట.

ఎత్తుకెళ్ళి పోతున్నాడు.

తమకంతో కొట్టుకు పోతూ... చుట్టుకున్న చీర జార్చే శాడు. మళ్ళీ భయ మనిపించింది. అతని ముఖం ప్రక్కకు తొలగిపోతే? భరించలేని బాధ. ఈ సారి ఆగలేదు. పెదవులు ఆగలేదు. చేతులు ఆగలేదు. బంగారు పువ్వులాంటి కల...సింగారంగా విచ్చుకుంది. అతని మోహం...హృదయం నిండా గుచ్చుకుంది.

అద్భుతంగా అమరిన కొత్త సుఖం తామర పువ్వు మీద నీటి ముత్యాల్లా మెరిసింది. భాగ్యలక్ష్మి పెదవులపై మధుర దరహాసం వెన్నెల రేఖలా కదిలింది.

అతని నుదుటి చెమటలో అతుక్కున్న శిరోజాల కొసని సుతారంగా తప్పిస్తూ అడిగింది...

"మరి ఇన్నిసార్లూ...అలా...ఎందుకు...? ఎందు కలా అయిం దమ్మా....ఇంత గ్రేట్‌గా ఉన్నావు...స్వీట్‌గా ఉన్నావు...ఇలా ఎందుకు? ఎందుకు..."

అప్పుడే ఆమె బుగ్గ మీద పెదవితో మళ్ళీ అద్దాడు ప్రకాశం. "నాకూ తెలీదు గాని బహుశా....ఇందుకే..." బుగ్గ మీద పెదవుల్ని అద్దాడు. "ఇప్పుడు బాగుంది గాని... ఆ టేస్ట్ నచ్చదు..."

ఆశ్చర్యంలో కొట్టుకు పోతూ గుర్తు చేసుకుంది. మామూలుగా బాగా అలంకరించు కోవడమే అలవాటు. ఇప్పుడు స్నానం నుంచి డైరెక్ట్‌గా....అలాగే ఉంది. పౌడర్ కూడా వేసుకో లేదు....

"ఏ టేస్ట్ రాజూ?"

"అదే...చిన్నప్పట్నుంచి నాకు పౌడర్ అంటే గిట్టదు...అలర్జీ...సారీ లక్ష్మీ...నువ్వు హర్ట్ అవుతా వని చెప్ప లేదు గాని..." అంటున్నా డతను.

"అయ్యో..." అంటూ అతణ్ణి చంటి పాపలా చూసి చూసి, అతని ముఖాన్ని రెండు చేతుల్తో అందుకుని హృదయానికి చేర్చుకుంది భాగ్యలక్ష్మి.

ఆమె మనసులో పౌడర్లు కాదు...వెన్నెలవాన....

09.08.1996 సంచిక